క్లుప్తంగా

బదిలీ పోలీసులకు వీడ్కోలు సన్మానం



బదిలీపై వెళ్తున్న సిబ్బందిని సత్కరించిన సీఐ సుబ్బరామిరెడ్డి

చంద్రగిరి: సుదీర్ఘ కాలం చంద్రగిరి పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ఎనిమిది మందిసిబ్బందిని ఆదివారం సీఐ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ, తరచూ రోడ్డు ప్రమాదాలతో ఎంతో మంది క్షతగాత్రులను కాపాడేందుకు పోలీసులు చేసిన సేవలు మరువలేనివన్నారు. కరుడుగట్టిన నేరస్థులను పట్టుకోవడంతో పాటు చోరీకి గురైన సొమ్మును రికవరీ చేయడంతో సిబ్బంది ప్రతిభ చాటారని, జిల్లాలో ఎక్కడ పనిచేసినా ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పురుషోత్తం నాయుడు, పీజే నాయుడు, లోకనాథం, రవి, సుబ్రమణ్యం, దేవేంద్ర, దివాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మబద్ధ జీవితం ముఖ్యం



మాట్లాడుతున్న ట్రూత్ స్పిరిచ్యువల్

తిరుపతి మంగళం: ప్రతి హిందువు సనాతన ధర్మాన్ని అనుసరిస్తూ, ఉప నిషత్తుల సారాంశం తెలుసుకుని ధర్మబద్ధంగా జీవించాలని ట్రూత్ స్పిరిచ్యువల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు వివేకానంద (విజ యవాడ) అన్నారు. ఆదివారం తిరుపతి అర్బన్ మండలం మంగళంలోని ట్రూత్ వివేకానందం కేంద్రంలో నిర్వహించిన భక్తి వేదాంత సత్సంగంలో ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంపొందించుకుని, మనిషి సరైన మార్గంలో నడవాలనిన్నారు. భారతీయులు అనుసరిస్తున్న ధర్మం ప్రపంచ దేశాలకు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో కిషోర్ కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

రాష్ట్ర వైద్య మండలి చైర్మన్‌గా డాక్టర్ శ్రీహరిరావు



డాక్టర్ శ్రీహరిరావును సత్కరిస్తున్న నాయకులు

తిరుపతి గాంధీ రోడ్: తిరుపతికి చెందిన ప్రముఖ రేడియాలజీ డాక్టర్ శ్రీహరిరావును రాష్ట్ర వైద్య మండలి చైర్మన్‌గా డాక్టర్ నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన సేవలను గుర్తించిన కూటమి ప్రభుత్వం గత నెల ఆయనను వైద్యమండలి సభ్యుడిగా నియమించింది. అనంతరం శనివారం వైద్య మండలి చైర్మన్‌గా ఆయన పేరును ఖరారు చేసింది. ఆయన బీజేపీ నేత కావడంతో స్థానిక నాయకులు గుండాల గోపినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పార్టీ కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందనడానికి ఈ నియామకం ఒక నిదర్శనమని, శ్రీవారి ఆశీస్సులతో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, మల్లారపు రవి ప్రసాద్, కరుణాకర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రామానుగ్రహం పొందిన ధన్యజీవి త్యాగరాజు



త్యాగయ్యకు పుష్పాంజలి ఘటిస్తున్న చిగోరా ఆధ్యాత్మిక కేంద్రం ప్రతినిధులు, కళాకారులు

తిరుపతి కల్చరల్: జీవితంలో సంగీతం, సాహిత్యంలో ప్రావీణ్యం సంపాదించి ఎన్నో సంకీర్తనలు సృష్టించి, 96 కోట్ల రామనామ జపం చేసి రామానుగ్రహం పొందిన ధన్యజీవి శ్రీత్యాగరాజస్వామి అని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రం అధినేత హనుమంత రావు అన్నారు. సద్గురు శ్రీత్యాగరాజస్వామి 258వ జయంతి పురస్కరించుకుని ఆదివారం రాముల వారి దక్షిణ మాడ వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవ కేంద్రంలో త్యాగరాజస్వామి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి మాట్లాడారు. 800 కీర్తనలను రచించి, గానం చేసి ఎందరికో జీవన భృతి కల్పించిన మహనీయుడు త్యాగయ్య అని కీర్తించారు. సీతారామచంద్రుల సంకీర్తన గానామృతంతో ఆ సేతు హిమాచల పర్యంతం మంత్ర ముగ్ధుల్ని చేసిన మహనీయుడు అని, ఆయన భక్తి బాటలో పయనించాలని కోరారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, కళాకారులు సుబ్రమణ్యం, బుచ్చిబాబు, గంగాధర గుప్తా, బ్రాహ్మణ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం




చెట్టు విరిగిపడటంతో ధ్వంసమైన ఆటో



వర్షానికి కూలిన గ్రీన్ మ్యాట్



చెట్టు విరిగిపడటంతో కూలిన షెడ్డు



రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షం



అమ్మ చీర చెంగే కొడుకుకు గొడుగు

వేసవి తాపంతో మండుతున్న ఎండలకు తిరుపతి నగర ప్రజలు విలవిలలాడిపోయారు.అయితే ఆదివారం తిరుపతినగరంలో గాలీవాన బీభత్సం సృష్టించింది. సుమారు రెండు గంటల పాటు ఎడతెరపి లేకుండా వడ గండ్ల వర్షం కురిసింది. దీనికి తోడు పెను గాలులు వీయడంతో పలుచోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. అంతేకాకుండా చెట్లు విరిగిపడి పలు వాహనాలు దెబ్బతిన్నాయి. హోర్డింగ్స్ దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల వైర్లు తెగిపోయాయి. ఓ వైపు వర్షం ప్రజలకు ఎంతో ఉపశమనమిచ్చినప్పటికీ వాహనాల ధ్వంసం మూలాన ఆస్తినష్టం వాటిల్లింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



ఏవండీ.. డ్రైవింగ్ జాగ్రత్త





కూల్.. కూల్ డ్రైవింగ్, పెనుగాలులకు దెబ్బతిన్న హోర్డింగ్



చున్నీనే గొడుగుగా పట్టి..



గొడుగులతో మేమిటూ.. గొడుగులు లేకుండా వాళ్లటూ..

నోటీస్ బోర్డు

- తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం
- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ.
- జిల్లాలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏపీపీఎస్సీ గ్రూప్–1 సర్వీస్ మెయిన్ పరీక్షలు
- శ్రీనృసింహ జయంతి సందర్భంగా అప్పలాయగుంటలోని శ్రీపద్మావతి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని సుదర్శన యాగ నరసింహస్వామి మండపంలో ఉదయం 5.30 గంటలకు కలశస్థాపన, 9 గంటలకు తిరుప్పావడ సేవ, సాయంత్రం 5 గంటలకు పుష్పయాగం
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 4 గంటలకు నాటక పోటీలు
- ఇంటర్‌మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు ఈరోజు సాయంత్రం 5 గంటల వరకు ఫీజు చెల్లించేందుకు గడువు

నేడు మండల సమావేశం

తిరుపతి రూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రామచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి 37మంది ఎంపీటీసీలతో పాటు సర్పంచులు, కో–ఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు, ఇంజినీర్లు హాజరు కావాలని కోరారు.

అట్టహాసంగా 'హీరా' వార్షికోత్సవం



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనత

చంద్రగిరి: మండలంలోని తొండవాడ హీరా ఉర్దూ పాఠశాల 26 వార్షికోత్సవం ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ముబారక్ జాన్ మాట్లాడుతూ, ముస్లిం కుటుంబాలలోని నిరుపేద బాలికలకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలనే సంకల్పంతో హీరా చైర్‌పర్సన్ నౌహీరా షేక్ 25 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఉర్దూ పాఠశాల వేలాది మంది విద్యార్థినుల జీవితాలలో వెలుగులు నింపిందని, ఇప్పుడు కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ముస్లిం బాలికలకు ఉచిత విద్యను అందిస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం 6 నుంచి 10వ తరగతి వరకు 400 మంది విద్యార్థినులు చదువుతున్నారని, వీరందరికీ విద్య, ఉచిత భోజన వసతి సౌకర్యాలను కల్పిస్తున్నట్లు హీరా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. అనంతరం వార్షికోత్సవంలో విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో సోమవారం నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులో తప్పులు సరిదిద్దుకోవడం కోసం, కొత్త ఆధార్ నమోదు ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు, అలాగే 12 నుంచి 15 వ తేదీ వరకు 12 సచివాలయాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. దొడ్డాపురం వీధి–1, ఐఎస్ మహల్ రోడ్–2, జర్నలిస్ట్‌కాలనీ–1, కెనడీ నగర్–1, మధురానగర్–1,2, పోస్టల్ కాలనీ–4, ప్రకాశంరోడ్–2, రాజీవ్ నగర్ జీవకోన–6, శంకర్ కాలనీ –1, రేణిగుంట రోడ్–1, రాజీవ్ నగర్ జీవకోన–3, చెన్నారెడ్డి కాలనీ –3లో ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు కమిషనర్ తెలియజేశారు.

నృత్యం.. సమ్మోహనం

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన వారాంతపు కార్యక్రమాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. చెన్నైకు గౌతమి మహేష్ శివార్పణం స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. పుష్పాంజలి, గణేష కవుతువం, అలరిప్పు, జాతీశ్వరం చక్రవాకం, శబ్దం, నాటవకురుంజి వర్ణం, మూషిక వాహన, కోలాటం..తదితర పాటలకు కళాకారులు సాయి కీర్తన రాజన్, పూజ, యజ్ఞనశ్రీ, రజిత, నిహారిక, దివ్యదర్శిని, ధృతి, అభిరామి, పూజా రాణి, శ్రీయ, నిత్య శ్రీనివాసిని, యోవిహి, సంగీత తదితరులు హావభావాలతో సమ్మోహితుల్ని చేశారు. అనంతరం ఏఓ సుధాకర్ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

చెత్త తొలగదు.. మురుగు పారదు



నగరపాలక సంస్థ స్వచ్ఛతపై చెబుతున్న మాటలు ఆచరణలో మరోలా ఉంటున్నాయి. నగరంలోని ప్రధాన మురుగు కాలువలు చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో డంపింగ్ యార్డులను తలపించేలా నిండిపోతున్నాయి. చెత్తను సకాలంలో తొలగించకపోవడంతో మురుగు నీరు ముందుకు సాగడం లేదు. ప్రధానం డీబీఆర్ అన్నమయ్య మార్గ్ నుంచి మంగళం ప్రధాన రహదారిలో కలసి మాస్టర్ ప్లాన్ రోడ్డు సమీపంలోని ప్రధాన కాలువలో చెత్త విపరీతంగా పేరుకుపోవడంతో మురుగు నీరు ప్రవహించేందుకు వీలులేకుండా సమీపంలోని ఇళ్లకు ఆనుకుని నిల్వ ఉండడంతో దుర్గంధం చిమ్ముతోంది. దుర్వాసన ధాటికి ఇంటి కిటికీలు సైతం తీయడం లేదని స్థానికులు చెప్పారు. అధికారులు చెత్తను తొలగించాలని కోరుతున్నారు. –తిరుపతి తుడా

డాక్టర్ ఆర్కే రెడ్డికి అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ ఆర్‌కే రెడ్డి

తిరుపతి సిటీ: హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఏఏఏ అబాకస్ సంస్థ ఆధ్వర్యంలో 20వ అంతర్జాతీయ అబాకస్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం అంగుల్లియా అర్థమేటిక్స్‌పై నిర్వహించిన పోటీలో తిరుపతికి చెందిన ఆర్‌కే అబాకస్ ఎడ్యుకేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. అబాకస్ శిక్షణలో ఆయన సేవలకు గుర్తింపుగా నిర్వాహకులు ఆయనకు అబాకస్ అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు. ఆర్‌కే అబాకస్ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు వేళ్లతో కాలిక్యులేటర్ కంటే వేగంగా లెక్కలు చేయడం, అలాగే వేళ్లతో 1000 మల్టిప్లికేషన్ టేబుల్స్‌ను పెన్ను పేపర్ లేకుండా సెకండ్స్‌లో చెప్పే విధంగా శిక్షణనిచ్చామని ఆ సంస్థ డైరెక్టర్ ఆర్కే విమల తెలిపారు. అబాకస్ సంస్థ ఫౌండర్ గంగాధర్, అన్నమయ్య జిల్లా బీసీ జనరల్ సెక్రటరీ అనగాని రెడ్డెప్ప, ఆర్‌కే అబాకస్ సభ్యులు అశోక్ రెడ్డి, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

శిక్షణతో దైవం, సమాజంపై బాధ్యత



చర్చిలో నృత్యం చేస్తున్న సండే స్కూల్ చిన్నారులు

పాకాల : శిక్షణతో భగవంతుని పట్ల భక్తి భావం, సమాజం పట్ల బాధ్యతగా మసలుకోవాలని సీఎస్ఐ పాస్టర్ ప్రేమ్‌కుమార్ ఉద్బోదించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహిస్తున్న పదిరోజుల సండే స్కూల్ శిక్షణ ఆదివారం ముగిసింది. 'గ్రోయింగ్ లీడర్స్' కాన్సెప్ట్‌తో 6 నుంచి 15 ఏళ్ల పిల్లలకు ఈ శిబిరం ఏర్పాటు చేశారు. మొత్తం 80మంది పిల్లలు ఈ శిబిరంలో నమోదు చేసుకున్నారు. బైబిల్‌కు సంబంధించి వివిధ అంశాలను వారికి నేర్పడంతోపాటు, ఆటపాటలు, చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. తమ మనసులోని భావాలకు తగ్గట్టు బొమ్మలు వేసి చిత్రలేఖనంలో తమ నైపుణ్యాన్ని చాటారు. అలాగే ముగింపు రోజు క్రైస్తవ గీతాలకు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. తాము గీసిన చిత్రాలను ప్రదర్శించారు. ప్రతిభ చాటిన చిన్నారులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సండే స్కూల్ టీచర్లు విమలా విక్టోరియా, ప్రమీల మార్గరెట్, పి.రూత్‌పావని, చర్చి సెక్రటరీ రాఘవేలు, క్రైస్తవులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

తిరుపతి కల్చరల్: అణగారుతున్న బీసీల అభ్యున్నతికి కాంక్షిస్తూ కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పర్నూరు నారాయణ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జనగణనతో పాటు కులగణన చేపడతామని ప్రధాని మోదీ రెండు రోజుల క్రితం ప్రకటించడం శుభపరిణామమని పేర్కొన్నారు. జనగణనతో పాటు కులగణన పూర్తి చేసి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు.

తప్పులు కప్పి పుచ్చుకునేందుకే ఆరోపణలు

- ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల్లో భారీగా అవకతవకలు
- స్వప్రయోజనాల కోసం పార్టీ మారిన మాజీ వైఎస్సార్ సీపీ నాయకులు చెవిరెడ్డిని విమర్శించడం హాస్యాస్పదం
- చంద్రగిరి సెగ్మెంట్‌లో విపరీతంగా భూ కబ్జాలు, ఇసుక, లిక్కర్ మాఫియా
- భయంతోనే మా నాయకుడిపై అభాండాలు



సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి

పాకాల: పేద ప్రజల కడుపు కొట్టి, కూలీ పనులు కల్పించకుండా ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో భారీ అవకతవకలు పాల్పడి జేబులు నింపుకున్న టీడీపీ నాయకులు తమ తప్పులు బయటపడతాయని ఎదుటి వారిపై బురద చల్లడం మొదలెట్టారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. ఆదివారం సాయంత్రం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఆయనతోపాటు ఎంపీపీ లోకనాథం, పాకాల పంచాయతీ అధ్యక్షుడు మునీర్, మండల ఉపాధ్యక్షుడు లోకనాథరెడ్డి, యూత్ ప్రెసిడెంట్ గుండ్లూరి సురేష్, నియోజవర్గ రైతు విభాగం అధ్యక్షుడు మాట్లాడారు. కనీసం వార్డు మెంబరు కూడా కాలేని వ్యక్తులు తమ పార్టీ మండల స్థాయి పదవులు ఇచ్చి తగిన ప్రాధాన్యత కల్పిస్తే, ఆ తర్వాత ఎలక్షన్‌కు ముందు ఒకరు, ఎలక్షన్ తర్వాత మరొకరు టీడీపీలో చేరి తమ నేత, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని విమర్శించడం చూస్తే ఈ వెన్నుపోటుదారులు ఎంతటి ద్రోహులో ప్రజలకు తెలుసున్నారు. ఒక నాయకురాలు ఎన్నికలముందు రూ.13 లక్షలు తమ నాయకుడు మోహిత్ రెడ్డి వద్ద తీసుకుని పార్టీ ఫిరాయించిందన్నారు. అలాగే పదవి కలిగిన మరో నాయకుడు తన ఇద్దరు కుమారులను తమ నాయకుడి వద్దకు పంపి డబ్బులు తీసుకుని పార్టీ మారారన్నారు. తాజాగా టీడీపీలో చేరిన నాయకుడు తన స్వలాభం కోసం దామలచెరువు, నేంద్రగుంటలో సమస్యాత్మకంగా ఉన్న తన స్థలాలను కాపాడుకునేందుకే పార్టీ మారారని జగమెరిగిన సత్యమన్నారు. ఇలాంటి నమ్మక ద్రోహుల వలనే పార్టీకి నష్టం కలిగిందని, ఇలాంటి హీనులు వైఎస్సార్‌సీపీ కోసం కోట్లు ఖర్చు పెట్టామని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అంతేకాకుండా వైఎస్సార్ సీపీ హయాంలో అవినీతి జరిగిందని టీడీపీ నేతలు నిందారోపణలు చేయడం సరికాదని, అధికారంలో ఉన్నది మీరే కాబట్టి దమ్ముంటే విచారణకు ఆదేశించి నిజాల నిగ్గు తేల్చాలని సవాల్ విసిరారు.

జంప్ జిలానీలకు సవాల్

మా పార్టీ గుర్తుతో గెలిచి, పదవులు అనుభవిస్తూ, ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత టీడీపీలో చేరి అక్రమార్జనే ధ్యేయంగా సాగుతున్న నీతిమాలిన నాయకులు పదవులకు రాజీనామాలు చేయాలని, ధైర్యం ఉంటే అదే రీతిలో ప్రజల్లోకి వెళ్లి తిరిగి ఎన్నికల్లో పోటీ చేయాలని సవాల్ విసిరారు. టీడీపీలో కూడా చేరి జేబులు నింపుకుంటున్న జంప్ జిలానీలపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నంగా కపిలేశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, నాయకులు గోపి, మధు, మునిరత్నంరెడ్డి, రమేష్, రాజేష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే అవినీతి నియోజకవర్గంగా చంద్రగిరి

రాష్ట్రంలోనే అవినీతి నియోజకవర్గంగా చంద్రగిరి ఉందని, భూ కబ్జాలు, ఇసుక, లిక్కర్ మాఫియాలో టీడీపీ నేతల ప్రమేయంపై చంద్రగిరి పేరు మార్మోగిపోతోందని, ఇది టీడీపీ అధినేత దృష్టికి వెళ్లిందని సాక్షాత్తు టీడీపీకి అనుకూల పత్రికల్లోనే కథనాలు, వార్తలు వచ్చాయన్నారు. అంతేకాకుండా ఉపాధి హామీ పథకంలో అవినీతి అక్రమాలకు సంబంధించి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, అలాగే రెండు రోజుల క్రితం తమ నాయకుడిని విమర్శించిన వారి అవినీతి చిట్టా కూడా తమ వద్ద ఉందని, వాటిని సరైన సమయంలో వెల్లడిస్తామన్నారు. అవినీతికి అండదండలు అందిస్తున్న ఎంపీడీఓ, ఏపీఓ, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, జైలుకెళ్లడం తప్పదని జోస్యం చెప్పారు.

బస్టాండ్‌లో నిఘా కరువు



తాళాలు లేని షట్టర్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి బస్టాండులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. శ్రీకాళహస్తి బస్టాండులో నిత్యం సెల్‌ఫోన్లు చోరీకి గురువుతున్నాయి. పోగొట్టుకున్న వారు అక్కడి ఆర్టీసీ సిబ్బందిని సీసీ ఫుటేజీల ద్వారా చోరీ దృశ్యాలను చూసి తెలుసుకోవాలని కోరగా తమ వద్ద లేవని వారు సమాధానం ఇస్తున్నారు. అంతేగాకుండా బస్టాండు ఆవరణలో ఉన్న దుకాణాల షట్టర్లను కొంతమంది దుండగులు పగులగొట్టి అందులోని వస్తువులు, డబ్బును దోచుకెళ్తున్నారు. దుకాణ షట్టర్లు పగలగొడితేనే దిక్కు లేకపోతే సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ప్రయాణికుల పరిస్థితి ఏమిటని పలువురు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.